క్లుప్తంగా

ఇంటింటా చెత్తసేకరణ పరిశీలన



ఇంటింటా చెత్త సేకరణపై ఆరా తీస్తున్న కమిషనర్ మల్లికార్జున

గుంతకల్లుటౌన్: పట్టణంలో ఇంటింటా చెత్తసేకరణ కార్యక్రమం సక్రమంగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పీహెచ్ వర్కర్లకు సూచించారు. మంగళవారం ఉదయం ఆయన 28వ వార్డులో పర్యటించారు. ఇంటింటా చెత్త సేకరణ, డ్రైనేజీల క్లీనింగ్ సక్రమంగా జరుగుతుందా? లేదా అని స్థానికులను ఆరాతీశారు. ప్రజలు పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. తాగునీరు పొదుపుగా వాడుకోవాలన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

ఏకాంబర స్వామి ఆరాధన



అలంకరణలో ఏకాంబరస్వామి

పెద్దపప్పూరు: చింతరపల్లి గ్రామంలో మంగళవారం సాయంత్రం అవధూత ఏకాంబర స్వామి ఆరాధనోత్సవం ఘనంగా జరిగింది. ఆశ్రమపీఠాధిపతులు, భక్తులు స్వామి వారి ఉత్సవమూర్తిని గ్రామపురవీదుల్లో ఊరేగించారు. కోర్కెలు నెరవేరిన భక్తులు స్వామివారికి ముడుపులు సమర్పించారు. భక్తులకు పీఠాధిపతులు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం ఏర్పాటు చేశారు.

ఆర్టీసీ బస్టాండ్‌ను సుందరీకరించండి

గుంతకల్లుటౌన్: గుంతకల్లు ఆర్టీసీ బస్టాండ్‌ను సుందరీకరించాలని డీఎం నారాయణస్వామిని డీవైఎఫ్ఐ నాయకులు కోరారు. మంగళవారం డీఎంను డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ప్రతాప్, చరణ్ తదితరులు కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. బస్టాండ్ ఆవరణలో బహిరంగ మల, మూత్రవిసర్జన లేకుండా ప్రయాణికులకు అవసరమైన టాయిలెట్లను నిర్మించాలని కోరారు. తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు.

సుబ్బరాయసాగర్ కాలువ పరిశీలన



సుబ్బరాయసాగర్ వద్ద కాలువను పరిశీలిస్తున్న అధికారులు

పుట్లూరు: మండలంలోని సుబ్బరాయసాగర్‌కు నీరు సరఫరా అయ్యే ప్రధాన కాలువను మంగళవారం డీఎస్పీ వెంకటశివారెడ్డి, హెచ్చెల్సీ ఈఈ రమణారెడ్డి, తహసీల్దార్ మోహన్‌కుమార్, హెచ్చెల్సీ అధికారులు పరిశీలించారు. సుబ్బరాయసాగర్‌కు నీరు సరఫరా అవుతున్న క్రమంలో నీరు వృథా కాకుండా ఉండటానికి తగు జాగ్రత్తలను తీసుకుంటున్నారు. కార్యక్రమంలో సీఐ సుబ్రహ్మణ్యం, బీకేఎస్ సీఐ నాగార్జునరెడ్డి, పుట్లూరు ఎస్ఐ దిలీప్‌కుమార్, ఆత్మకూరు ఎస్ఐ జనార్దన్, హెచ్చెల్సీ అధికారులు పాల్గొన్నారు.

ఐటీఐలో 5వ విడత కౌన్సెలింగ్

గుంతకల్లుటౌన్: ప్రభుత్వ ఐటీఐలో మిగిలిపోయిన సీట్లకు 5వ విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ టి.నరేంద్రనాథ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. టెన్త్ పాసైన విద్యార్థులు ఈ నెల 7వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు వెంట తీసుకొచ్చి వెరిఫికేషన్ చేయించుకోవాలని తెలియజేశారు.

13న రాజ్యాధికార చైతన్య సభ



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బీఎస్పీ నాయకులు

గుంతకల్లుటౌన్: ఈ నెల 13న గుంతకల్లు అంబేడ్కర్ సర్కిల్ వద్ద బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో బహుజన రాజ్యాధికార చైతన్య సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గద్దల నాగభూషణం కోరారు. ఈ సభను విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం ఆ పార్టీ నాయకులు పురవీధుల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. బడుగులకు రాజ్యాధికారంతో అణగారిన వర్గాల అభివృద్ధి సాధ్యమని ఆయన తెలియజేశారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరాజు, రాప్తాడు ఇన్‌చార్జ్ ఓబులేసు, నాయకులు విజయ్, వెంకటకొండయ్య, శివన్న, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో పేదలకు భరోసా



వృద్ధుడితో ఆరోగ్యంపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి



శింగనమల: కేస్ షీట్‌ను అందిస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి



మందుల వివరాలను తెలుసుకుంటున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

● ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

పుట్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేదలకు ఆరోగ్య భరోసా కల్పిస్తున్నారని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. మంగళవారం ఆమె చెర్లోపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూపాయి ఖర్చు లేకుండా జగనన్న ఆరోగ్య రక్ష ద్వారా వైద్య పరీక్షలతో పాటు వైఎస్సార్ ఆరోగ్య శ్రీ ద్వారా ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయిస్తారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. అనంతరం క్యాంపులో పాల్గొన్న వైద్య నిపుణులతో మాట్లాడటంతో పాటు చికిత్స చేయించుకోవడానికి వచ్చిన ప్రజల ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మొత్తం 255 మందికి వైద్య పరీక్షలు నిర్వహిండంతోపాటు 42 మందిని మెరుగైన వైద్యం కోసం సిఫార్సు చేసినట్లు వైద్యులు తెలిపారు. తహసీల్దార్ మోహన్‌కుమార్, ఎంపీడీఓ యోగానందరెడ్డి, డాక్టర్ శ్రీవాణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట

శింగనమల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి అన్నారు. మంగళవారం ఈస్ట్.నరసాపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పేదల ముంగిటకే నాణ్యమైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టారన్నారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాటక అకాడమీ చైర్‌పర్సన్ ప్రమీల, డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి, ఎంపీపీ యోగేశ్వరి

బుక్కరాయసముద్రం: నిరుపేదలకు ఇంటి వద్దే మెరుగైన వైద్యం అందించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ పేర్కొన్నారు. మంగళవారం కొట్టాలపల్లి సచివాలయంలో సర్పంచ్ పార్వతి అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభించారన్నారు. ఈసందర్భంగా 354 మందికి వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ భాస్కర్, స్పెషలాఫీసర్ శ్రీదేవి, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ తేజోత్స్న, జిల్లా మలేరియా అధికారి ఓబులు పాల్గొన్నారు.

యల్లనూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందని జెడ్పీటీసీ భోగతి ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం వెన్నపూసపల్లి సచివాలయంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్యులు లోకేష్‌కుమార్, శివసాయి, సాయినాగశ్రీ 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించడంతోపాటు మందులు పంపిణీ చేశారు.

గార్లదిన్నె: బూదేడులో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. వైద్యాధికారులు డాక్టర్ గౌతమి, దిలీప్‌కుమార్, ఎముకల డాక్టర్ అనిల్ కుమార్ యాదవ్, డాక్టర్ మమత దాదాపు 335 మందికి వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. మండల స్పెషల్ ఆఫీసర్ శాంతి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటలక్ష్మి, సర్పంచు శివాంజనేయులు, ఆరోగ్య విస్తరణ అధికారి నాగేశ్వరయ్య, సీహెచ్ఓ లోక్‌నాథ్ పాల్గొన్నారు.

నార్పల: బొందలవాడ గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. వైద్యులు 213 మందికి వైద్య పరీక్షలు చేశారు. తహసీల్దార్ హరికుమార్, ఎంపీడీఓ దివాకర్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

యాడికి: చందన గ్రామంలో మంగళవారం ఈఓపీఆర్డీ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యాధికారులు శ్రీరాం కుమార్, దేవరాజన్‌లు, గైన కాలజిస్టు లక్ష్మీసంధ్య, సర్జన్ ఇంజుమామ్ 233 మందికి వైద్య పరీక్షలు నిర్వహించడంతోపాటు మందులు పంపిణీ చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు సంపూర్ణ పోషణ కిట్లు అందజేశారు. తహసీల్దార్ అలెగ్జాండర్, ఎంపీటీసీ సభ్యురాలు రాగుల పార్వతి, వైఎస్సార్‌సీపీ నాయకులు శివకేశవ రెడ్డి, జలదుర్గం రామాంజనేయులు, వెంకటరామిరెడ్డి, కంటి వైద్యుడు మధుసూధన్ రాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయకుమారి, హుసేనమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు: జూటూరు సచివాలయంలో మంగళవారం జగనన్న ఆరోగ్యసురక్ష శిబిరం నిర్వహించారు. ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి డా.కళ్యాణ్ కుమార్ వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మానాయక్, ఎంపీడీఓ రామకృష్ణ, ఈఓఆర్‌డీ కమలాబాయి తదితరులు పాల్గొన్నారు.

గుత్తి రూరల్: బసినేపల్లి విలేజ్ హెల్త్ క్లినిక్‌లో మంగళవారం జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. బేతాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సందీప్‌యాదవ్ రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఎంపీడీఓ శివాజీరెడ్డి, కార్యదర్శి ధనలక్ష్మి, సర్పంచ్ మహబూబ్‌బీ, ఉప సర్పంచ్ హనుమంతు, వైఎస్సార్‌సీపీ నాయకులు షెక్షావలి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: క్రిష్టిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్రీనివాస బాబు, శ్రీనివాసులరెడ్డి, జనరల్ మెడిసిన్ డాక్టర్ నాగార్జున, ఆర్థో స్పెషలిస్టు సయ్యద్‌అహమ్మద్ దాదాపు 354 మందికి పరీక్షలు చేసి మందులు అందించారు. మరో 35 మందిని జిల్లా కేంద్రానికి రెఫర్ చేశారు. తహసీల్దార్ నాగభూషణ, ఎంపీడీఓ కుళ్ళాయిస్వామి, సీడీపీఓ షాజిదాబేగం, సూపర్‌వైజర్ శంషాద్‌బేగం పాల్గొన్నారు.

పామిడి: దేవరపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ నక్కా సౌభాగ్య మంగళవారం ప్రారంభించారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యాధికారి సుధాకర్, డాక్టర్లు మౌనిక, వంశీకృష్ణ, మనీషా, సుధాకర్ 216 మందికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందించారు. అంగన్‌వాడీ సిబ్బంది పౌష్టికాహార ప్రదర్శన ఏర్పాటు చేశారు. రూరల్ బూత్ కన్వీనర్, సీనియర్ నాయకుడు ఆర్‌సీ వెంకట్రామిరెడ్డి, మండల స్పెషలాఫీసర్ అప్పాజీరావు, ఈఓఆర్డీ బీవీ శశికళ, బీసీ సెల్ రూరల్ కన్వీనర్ ఓబులాపురం ఓబులేసు పాల్గొన్నారు.

తాడిపత్రి: గంగాదేవిపల్లిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యులు కేశవానంద, లావణ్య యశస్విని, స్పెషలిస్ట్ వైద్యులు స్రవంతి, మహేష్ కుమార్ రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. రాష్ట్రీయ బాల సురక్షా కార్యక్రమ స్పెషలాఫీసర్ నారాయణ స్వామి, స్పెషలాఫీసర్ ఓబుళమ్మ, డీఎల్‌పీఓ సుమన జయంతి, ఎంపీడీఓ రంగారావు, సర్పంచ్ హనుమంతరెడ్డి పాల్గొన్నారు.



పెద్దవడుగూరు : రోగులకు మందులను పంపిణీ చేస్తున్న దృశ్యం



పామిడి: దేవరపల్లిలో వైద్య సేవలు పొందుతున్న ప్రజలు

చదువుతో బంగారు భవిష్యత్తు

● ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి



చెర్లోపల్లిలో సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

పుట్లూరు: చదువుతో బంగారు భవిష్యత్తు సాధ్యమని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. మంగళవారం ఆమె చెర్లోపల్లి, ఓబుళాపురం, దోశలేడు గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చెర్లోపల్లి ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించడంతో విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మన పిల్లలకు మనం ఇచ్చే అతి పెద్ద ఆస్తి చదువు అని నమ్మిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడు కింద పాఠశాలల అభివృద్ధితో పాటు విద్యా రంగంలో అనేక మార్పులను తీసుకొచ్చారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిషు మీడియాన్ని జగనన్న ప్రవేశపెడితే ప్రతిపక్షాలు అడ్డుకోవడానికి ప్రయత్నించాయన్నారు. పేదల పిల్లలు కూడా ఇంగ్లిషు మీడియంలో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవడాలని జగనన్న ఆకాంక్షిచారని తెలిపారు. పేదల సంక్షేమం కోసం నిరంతరం ఆలోచించే జగనన్నకు మనమందరం అండగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్లలో ఆయా కుటుంబాలకు ప్రభుత్వం అందించిన లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ మూలి వెంకటరామిరెడ్డి, సింగిల్ విండో ప్రెసిడెంట్ రామసుబ్బారెడ్డి, వైస్ ఎంపీపీ లక్ష్మీనారాయణమ్మ, సర్పంచ్‌లు పక్కీరప్ప, రామాంజులరెడ్డి, మండల కన్వీనర్ నాగేశ్వరరావు, నాయకులు నాగేశ్వరరెడ్డి, కంచెం శ్రీనివాసులరెడ్డి, నాయకులు గుత్తా హర్షవర్ధన్‌నాయుడు, కేశవ, సుధాకర్‌రెడ్డి, నరసింహారెడ్డి, మాబూసాహెబ్, సాయినాథ, మహేశ్వరరెడ్డి, గోపాల్‌నాయుడు, రామమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీగా ఓటేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడండి



మాట్లాడుతున్న ఆర్‌డీఓ రవీంద్ర

గుంతకల్లుటౌన్: ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ నిజాయితీగా ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఆర్‌డీఓ జి.రవీంద్ర, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున కోరారు. ఓటు ప్రాధాన్యతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఎన్నికల సంఘం ఆదేశానుసారం మంగళవారం సాయంత్రం స్వీప్ (వ్యవస్థీకృత ఓటర్ల విద్య, ఎన్నికల భాగస్వామ్యం) ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి గాంధీచౌక్ వరకు ప్రజా,స్వచ్ఛంద, మహిళా సంఘాలు, విద్యార్థులతో కలిసి భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రజలను చైతన్య పరిచి ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకునేలా అవగాహన పెంచేందుకు మున్సిపల్ కార్యాలయ ఆవరణలో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డీఓ, కమిషనర్ మాట్లాడుతూ ఓటు హక్కు వినియోగించుకుని సమర్థవంతమైన నాయకులను ఎన్నుకోవాలన్నారు. 18 ఏళ్లు నిండిన వారు తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి, సీఐలు రామసుబ్బయ్య, గణేష్, ఎన్నికల అధికారులు, ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు, స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

పీఎఫ్‌లో కోతపై జెడ్పీ చైర్‌పర్సన్ ఆగ్రహం



అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం సిటీ: జెడ్పీ ఉద్యోగ, ఉపాధ్యాయుల పీఎఫ్‌లో కోత విధించడంపై జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. జెడ్పీలోని తన చాంబర్‌కు డిప్యూటీ సీఈఓ లలితాబాయి, పీఎఫ్ విభాగం పరిపాలనాధికారులు ఉషాకుమారి, శ్రీనివాసులరెడ్డిని పిలిపించి మాట్లాడారు. పీఎఫ్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి 75 శాతం కాకుండా 50 శాతం మాత్రమే మంజూరు చేయాలని మీకు ఎవరు చెప్పారని చైర్‌పర్సన్ ఏఓలను ప్రశ్నించారు. డిప్యూటీ సీఈఓ ఆదేశాల మేరకే తాము అలా చేశామని వారు బదులిచ్చారు. ఇన్‌చార్జ్ సీఈఓ కేతన్‌గార్గ్ ఆదేశాల మేరకే తాను కింది స్థాయి సిబ్బందికి అలా చెప్పానని డిప్యూటీ సీఈఓ సమాధానమిచ్చారు. అనంతరం ఏ సెక్షన్ ఉద్యోగులను సాయంత్రం తన చాంబర్‌కు పిలిపించి గట్టిగా మందలించారు. తనకు తెలియకుండా కొందరు ఉద్యోగులకు సెక్షన్లు మార్చడంపైనా అసహనం వ్యక్తం చేశారు.

అంబేడ్కర్ అడుగుజాడల్లో నడవాలి



నగదును అందిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లు: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అడుగు జాడల్లో నడవాలని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. కసాపురం గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన నాగేశ్వరరెడ్డి రూ.60 వేలు ఎమ్మెల్యే చేతుల మీదుగా గ్రామస్తులకు అందజేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాది లింగేశ్వరబాబు, ఎమ్మార్పీఎస్ నాయకులు స్వామిదాసు, పవన్, ఆంజనేయులు, మాజీ సర్పంచ్ తిక్కస్వామి, బెస్త సంఘం నాయకుడు మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: స్థానిక ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డిని తహసిల్దార్ ప్రతాప్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసారు. మంగళవారం ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

అర్హులందరికీ న్యాయం




స్థానికులతో మాట్లాడుతున్న కేతిరెడ్డి సాయి ప్రతాప్‌రెడ్డి

తాడిపత్రి: జగనన్న పాలనలో అర్హులందరికీ న్యాయం జరుగుతోందని వైఎస్సార్‌సీపీ యువనేత కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన యర్రగుంటపల్లి గ్రామంలో పర్యటించారు. ఈసందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్థానికులు పలు సమస్యలు తెలియజేయగా వాటిని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమ రెండు కళ్లుగా పాలన సాగిస్తున్నారన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు గడప వద్దే అందిస్తున్నారన్నారు. రాష్ట్రంలో జగనన్న సంక్షేమ పాలన కొనసాగాలంటే మరోసారి సీఎంగా చేసుకుందామని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కిశోర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పల్లె నాగేశ్వర్‌రెడ్డి, నాయకులు సూర్యనారాయణ, చౌడప్ప, రామాంజి, బాబు, కిష్టయ్య, రాజు, లక్ష్మిరంగయ్య, బాబా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరి అదృశ్యం

పెద్దవడుగూరు: చిన్నవడుగూరుకు చెందిన ఓ యువతి స్వాతి, బాలిక అపర్ణ అదృశ్యమైనట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఈనెల 1న ఇంటి నుంచి వెళ్లిపోయిన వారు తిరిగి రాలేదు. బాధితుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. వారి ఆచూకీ తెలిసిన వారు ఎస్ఐ 9440796826, యాడికి సీఐ 9491308872 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

రహదారి విస్తరణ పనులు ప్రారంభం



జేసీబీతో ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

నార్పల: మండల కేంద్రంలోని మంగళవారం అధికారులు రహదారి విస్తరణ పనులు ప్రారంభించారు. గాంధీ సర్కిల్ వద్ద ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న ఆక్రమణలను రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ అధికారులు భారీ బందోస్తు మధ్య తొలగించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రధాన రహదారికి ఇరువైపుల ఉన్న ఆక్రమణలను తొలగించుకోవాలని ఆక్రమణదారులకు ఏళ్ల తరబడి చెబుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఈనేపథ్యంలో బందోబస్తు మధ్య తొలగిస్తున్నామన్నారు. తహసీల్దార్ హరికుమార్, ఎంపీడీఓ దివాకర్, సీఐ అస్రర్ బాషా, ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అశ్వర్థ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గన్నెవారిపల్లిలో నేడు 'జగనన్న ఆరోగ్య సురక్ష'

తాడిపత్రి: గన్నెవారిపల్లి కాలనీలో సచివాలయం –2కు సంబంధించి ఎంఈఓ కార్యాలయం ఆవరణలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రంగారావు మంగళవారం తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ప్రజలను కోరారు.

నేడు గూగూడుకు ఎమ్మెల్యే రాక

నార్పల: గూగూడు గ్రామానికి బుధవారం ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి రానునట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రఘునాథ్‌రెడ్డి, అనంతపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి తెలిపారు. గ్రామంలో ఎమ్మెల్యే జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ప్రారంభిస్తారన్నారు.

వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

పామిడి: ఎంపీడీఓ కార్యాలయ ఛాంబర్‌లో పామిడి పంచాయతీలో ఖాళీగా ఉన్న వలంటీర్ల పోస్టులకు మంగళవారం సాయంత్రం ఈఓఆర్డీ బీవీ శశికళ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆరు పోస్టులకు గాను 15 మంది దరఖాస్తు చేసుకున్నారు. అందులో 10 మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారు.

మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సీఐ హమీద్‌ఖాన్

తాడిపత్రి అర్బన్: మహిళలకు చట్టాలపై కనీస అవగాహన ఉండాలని అర్బన్ సీఐ హమీద్‌ఖాన్ సూచించారు. పట్టణంలోని స్థానిక ఓంశాంతి నగర్‌లో మంగళవారం సాయంత్రం నేరాలు, చట్టాలపై మహిళలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ సైబర్ నేరాలపై అందరికీ అవగాహన ఉండాలన్నారు. పిల్లలు మొబైల్ ఫోన్ల వినియోగంపై తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఇంటర్నెట్‌లో జరుగుతున్న మోసాలు, వాటి నుంచి ఎలా రక్షించుకోవాలో తెలియజేశారు. కార్యక్రమంలో వార్డు మహిళా పోలీసులు, వలంటీర్లు పాల్గొన్నారు.

కందిపప్పు పంపిణీ చేయాలి

తాడిపత్రి అర్బన్: కార్డుదారులకు కందిపప్పు పంపిణీ చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం సీఎస్‌డీటీ రాజాకు వినతి పత్రం అందజేశారు. సీపీఐ పట్టణ కార్యదర్శి చిరంజీవి యాదవ్ నాయకులు సూరి, రమణ, శ్రీరాములు, రామాంజి, నాగేంద్ర, రత్నమయ్య పాల్గొన్నారు.

చురుగ్గా డ్రైనేజీ పూడికతీత పనులు



భగత్‌సింగ్ నగర్‌లో పూడికతీత పనులను చేస్తున్న కార్మికులు

తాడిపత్రి అర్బన్: పట్టణ వ్యాప్తంగా అండర్ డ్రైనేజీ చాంబర్లలో పూడికతీత పనులు చురుగ్గా సాగుతున్నాయి. బ్లాక్ అయిన డ్రైనేజీ చాంబర్లను శుభ్రం చేసేందుకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చొరవ తీసుకుని ప్రత్యేకంగా కార్మికులను ఏర్పాటు చేశారు. స్థానిక భగత్‌సింగ్ నగర్‌లో మంగళవారం వార్డు కన్వీనర్ మనోజ్ దగ్గరుండి డ్రైనేజీ పూడికతీత పనులను చేయించారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి డ్రైనేజీల్లో ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు, పాడి చెత్త లాంటివి వేయొద్దని ప్రజలకు సూచించారు.

ఇద్దరికి గాయాలు

గుత్తి: పట్టణంలోని గుంతకల్లు రోడ్డులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలు.. పత్తికొండకు చెందిన ఫణీంధర్, మణి కుమార్ గాంధీ సర్కిల్ వద్ద నుంచి గుంతకల్లు వైపు బైక్‌పై బయలుదేరారు. కుక్క అడ్డు రావడంతో అదుపు తప్పి కిందపడ్డారు.